తెచ్చిచ్చిన!'' అన్న.

''ఇంగవోని! వండిన గదా!'' అన్నది అమ్మి.

నా మనసెందుకో ఏదోలా అయింది. ఆటవిక దశలో జంతువులను వేటాడి తిన్న మనిషి, కులాలుగా మతాలుగా విభజించుకొని, వేష భాషలు మార్చుకొని, తోటి మనిషి ఆహారపు అలవాట్లను నిరసిస్తూ ద్వేషిస్తూ.. శెత్! ఏ శాశ్వత సుఖాలకోసం ఈ వెర్రి? ఇలా ఏవో ఆలోచిస్తూ ఉండిపోయిన. అమ్మి కిచెన్‌లోంచి వచ్చి ముందుగా మామకు వడ్డించింది. మామ తిని లేచాక నేను, అమ్మి తిన్నం. కొద్దిసేపటి తర్వాత..

''సాబెరా! మీతో ఓ మాట మాట్లాడి పోదమని వచ్చిన!'' అన్నడు మామ.

''బోలో భయ్యా!'' అన్నది అమ్మి.

''మాకు ఇద్దరు ఆడపిల్లలు.. మీకు తెలుసు కదా! పెద్దమ్మాయికి మీ వదిన తరపు చుట్టాల సంబంధం చేసినం. చిన్నమ్మాయిని మన ఉమేర్‌కు ఇద్దామనుకుంటున్నం! ఈ విషయమే మీతో మాట్లాడి పోదమని వచ్చిన!'' అన్నడు మామ.

మామ నోట ఊహించని మాట విన్న అమ్మి నా వైపు సూసింది. ఆ చూపులు తన లేగను ఎత్తుకపోటానికొచ్చిన పులిని చూసిన గంగిగోవు చూపుల్లెక్కున్నయి. అమ్మి ఏం మాట్లాడకుండా ఉండిపొయింది.

''ఏం మాట్లాడ్తలేవు సాబెరా?'' అడిగిండు మామ.

''నేనేం మాట్లాడ్త భయ్యా! మేము మీ తాహతుకు తగినోల్లం కాదు! మీరే ఇంకోపాలి ఆలోచించుకోరి!'' అన్నది అమ్మి.

''బాగా ఆలోచించుకునే ఈ నిర్ణయం తీసుకున్నం సాబెరా! ఉమేర్ పెద్ద చదువులు చదవుతానంటున్నడు. దానికి బోలెడు ఖర్చు వస్తది. మీకంత ఆర్థిక స్తోమత లేదు! ఉమేర్ చదువుకయ్యే ఖర్చులు మేమే భరిస్తం! మా అమ్మాయి మెడిసిన్ చదువు పూర్తిచేస్తది. మన రెండు కుటుంబాల మంచి కోరే ఈ నిర్ణయం తీసుకున్నం!'' అన్నడు మామ.

''నీ అల్లున్నే అడుగు భయ్యా! పిల్లనిచ్చేది నువ్వు. చేసుకునేది వాడు! వాని ఇష్టమే నా ఇష్టం!'' లౌక్యంగా తప్పుకొన్నది అమ్మి. మామ నా వైపు సూసిండు.

'ఇంత అదృష్టం కలిసి వస్తూంటే కాలదన్నుకుంటవా!?' అన్నట్లున్నయి ఆ చూపులు.

''ఇప్పుడే కదా మామా.. నువ్వు చెప్పింది! కొంత టైమివ్వు. ఆలోచించుకొని చెప్తం! పన్నెండు కావస్తున్నది మామ! నిద్రొస్తున్నది.. పడుకుందాం!'' అన్న.

మాది సిమెంటు రేకుల చిన్న ఇల్లు. రెండు గదులు, ఒక వంట గది ఉంటది. లోపట గదిలో ఒకటే మంచముంటది. ఆ గదిలో మామను పడుకోమని చెప్పి, ముంగటి గదిలో అమ్మి, నేను పడుకున్నం.

మామతో నిద్రొస్తున్నదని చెప్పిన గని.. పడుకున్నంక నిద్రొస్తలేదు. మామ కూతురే కండ్లల్ల తిరుగుతున్నది. ఎవరో గొప్ప శిల్పి చెక్కిన శిల్పంలా ఎంత అందంగా ఉందో! ఒకటే ఆలోచనలు. నిద్ర – మెలుకువ కాని స్థితి. అమ్మి వైపు చూసిన. మాటి మాటికీ పక్క మారుతున్నది. అమ్మి గుడా ఏదో ఆలోచిస్తున్నట్లున్నది. కంటికి కునుకు పట్టకుండానే తెల్లారింది.

మామ ఐదింటికే లేసిండు. ఫజర్ నమాజ్ సదువుకున్నడు. నేనూ, అమ్మిగుడా లేసి ఫ్రెషప్ అయినం.

ఇద్దరం టీ తాగినం.

''సాబెరా! మీరు ఎంత తొందరగా మీ నిర్ణయం చెప్తే అంత మంచిది! రెండు నెలల్లో పెళ్లి పెట్టుకుందాం! రెండువైపుల ఖర్చులు మేమే పెట్టుకుంటం! పెళ్లి గ్రాండ్‌గ చేద్దాం!'' అన్నడు. అమ్మి తలొంచుకొని..

''సరే.. అట్లనే చెప్తంలే భయ్యా!'' అన్నది.

నేను, మామ ఇంట్లె నుంచి బయటవడి బస్టాండ్ చేరుకున్నం. బస్సు గంట లేటుగ వస్తదని తెల్సింది.

కొద్దిసేపటి తర్వాత..

''ఉమేర్! నువ్వు కష్టపడి చదువుకుంటున్నవ్ బాగనే వుంది గని, ఈ నాన్ ముస్లిం దోస్తానా జర తగ్గిస్తె మంచిగుంటది!'' అన్నడు మామ.

మామ మాటల్లోని తత్వం నాకర్థమైంది. నేనింకా మేనల్లున్నే. ఇంటి అల్లున్ని కాకముందే మామ నాపై ఆంక్షలు విధిస్తున్నట్లు అన్పించింది. నేను విన్న ఇస్లె మాల్లో మౌల్వీలు, ముఫ్తీలు గుడా అన్ని మతస్తుల వారితో మమేకమై.. గంగా జమున తహెజీబ్ లెక్కనే కలిసిమెలిసే ఉండాలంటరు. కానీ, మామ ఎందుకిలా మాట్లాడుతున్నడో అర్థమైతలేదు.

''హిందు దోస్తులెంట తిరిగితే అల్లా నారాజ్ అయితడా మామ?'' అనడిగిన.

''అలా అని కాదు! హిందూ దేవుళ్ల ఊరేగింపులకు కుంకుమ జల్లుకొని ఊరేగడం మన ముస్లిం ధర్మం ఒప్పుకోదు!'' అన్నడు మల్ల.

''సారీ మామ! మనమున్న సమాజంలో గిరిగీసుకొని బతకడం కుదరదు! మనది కలివిడి సమాజం మామ! ఒకరి ధర్మాన్ని ఒకరు గౌరవించుకుంటూ, కలిసిమెలిసే బతకాలి! ఓ మాట చెప్త విను మామ! చెల్లెలికి పెళ్లి చేసినాంక మాకు అప్పులైనయి! ఇంట్లె పూట గడవడమే కష్టమైంది! అప్పుడే కరోనా వచ్చింది! మా పక్కింటి నర్సమ్మ పెద్దమ్మ మమ్ముల ఒక్కపూట గుడా పస్తులు పడుకోకుండ ఆదుకుంది! మా అబ్బు హిందు దోస్తులు కూడా ఎంతో సహాయం చేసిండ్రు! ఒకవేళ వాళ్లు మనకెందుకులే అనుకొని ఉంటే.. మా పరిస్థితి ఏమయ్యేదో ఓసారి ఆలోచించు!'' అన్న.

''కావచ్చు! నేను కాదనను! కానీ, నీకు తెలీని దైవిక సత్యం ఒకటుంది! అదేంటంటే మనకు అవసరమైన రిజఖ్‌ను అల్లాయే నిర్ణయిస్తాడు. అది ఎవరి ద్వారా మనకు చేరవేయాలో అల్లానే చేరవేస్తాడు! మీ అబ్బు నాన్ ముస్లిం దోస్తుల ద్వారా, నర్సమ్మ ద్వారా అల్లా మీ రిజఖ్ మీకు చేర వేసిండు అంతే! ఇందులో వాళ్ల గొప్పతనమో.. త్యాగమో ఏమీ లేదు!'' అన్నడు మామ.

''ఒప్పుకొంట మామ! వాళ్లు వాళ్ల దేవుళ్లకు, దేవతలకు పెట్టుకొని.. యాటలు, కోళ్లు బలిస్తరు! ముర్దార్ తింటరు! మా రిజఖ్‌ను ముర్దార్ తినేటోళ్ల ద్వారా అల్లా ఎందుకు పంపినట్టూ? మీలాంటి పవిత్ర నమాజీల ద్వారా ఎందుకు పంపలేదు?'' అనడిగిన.

మామ ఖంగుతిని సమాధానం చెప్పలేకపొయిండు.

''రాత్రి నర్సమ్మ పెద్దమ్మ తెచ్చిచ్చిన దావత్ అన్నం నువ్వు తినలేదు! నాకు బాధేసింది మామ! మన నమ్మకాలు మనవే.. కాదనను. ఒకటడుగుతా చెప్పు! నీ తలకు పెట్టుకున్న టోపి, కాళ్లకేసుకున్న చెప్పుల వరకు ఎవరి చేతి ఉత్పత్తులో నీకెర్కేనా? మన దేశ జనాభాలో హలాల్ తినేవాళ్లు పద్దెనిమిది శాతం మంది ఉంటే, ఎనభై శాతం పైచిలుకు ముర్దార్ తినేవాళ్లే ఉంటరు! మనం తినే ఆహార పదార్థాల ఉత్పత్తిలో, ఔషధాల ఉత్పత్తిలో, సేవల రంగంలో.. ఇట్లా చెప్పుకొంటూ పోతే ప్రతి రంగంలోనూ ఎనభైశాతం మంది ముర్దార్ తినేవాళ్ల శ్రమ, నైపుణ్యమే ఉంటది. వాటి వినియోగం మానేయగలమా? ఇక హలాల్ తినేవారి శ్రమ, ఉత్పత్తులను వినియోగించకుండా.. సోకాల్డ్ హిందూ వేర్పాటువాద భావజాలం కలవారు మనగలుగుతారా? ఎవరు తినేదైనా ఆహారమే మామ! సమష్టి శ్రమ, ఉత్పత్తి, వినియోగంతోనే సమాజం మనగలుగుతుంది! ఇదే ప్రాపంచిక సత్యం! పరమత సహనం లేనివారు, సాటి మనిషి ఆహారపు అలవాట్లను ద్వేషించేవారు నా దృష్టిలో అజ్ఞానులు మామా!'' అన్న.

మామ విస్మయంగా నా వైపే చూస్తుండు.

ఇంతల్నే బస్సు వచ్చి ఆగింది. మామ ఎక్కి కూకుండు. పెళ్లి విషయంలో నా అభిప్రాయాన్ని రాసి పెట్టుకున్న చీటి. బస్సు కదిలేటప్పుడు మామ చేతికిచ్చిన. బస్సెళ్లిపోయింది.

తిరిగి ఇంటికొచ్చిన.

''మామ ఎలివోయిండా బేటా?'' అనడిగింది అమ్మి.

ఆ మాటల్లో ఏదో దుఃఖపు జీర.

''ఆ.. ఎలివోయిండు!'' అని అమ్మి కండ్లవైపు చూసిన.

ఉబికి ఉబికి వస్తున్న కన్నీళ్లను దాచే ప్రయత్నం చేస్తున్నది అమ్మి. కొడుకు నిర్లక్ష్యానికి గుర్తై.. నానా గోసవడి చచ్చిన అమ్మమ్మ – తాత యాదికొచ్చి ఉంటరేమో? నేను దగ్గిరకువొయి అమ్మి ఒళ్లో చిన్న పిల్లాడిలా పడుకొని ఆమె కళ్లు తుడిచి..

''అమ్మీ! నాకు మేనమామ సాలు రాలే! మామ మన పేదరికంతో రిశ్తే ఎప్పుడో తెంపుకొన్నడు! అనుబంధాలనేవి డబ్బుతో కొనేవి కావని మామకు తెలుస్తలేదు! నా చదువుకు పెళ్లి ఆటంకం కాకూడదనుకొన్న. అందుకే మామకు తన కూతురితో పెళ్లికి 'సారీ' చెప్పి వచ్చిన!'' అనేసరికి అమ్మి ఆశ్చర్యపొయింది.

బస్సు కదిలేటప్పుడు నేను మామ చేతికిచ్చిన చీటి అదే.

సాదికి వోయి జుబేర్ మామ రెండుసార్లు 'హజ్' చేసి వచ్చినడంట. కానీ, నేను ప్రతిరోజూ అమ్మి రెండు కండ్లల్లో.. 'మక్కా – మదీన' లను చూస్తుంట. ■

## సయ్యద్ గఫార్



ప్రేమానుబంధాలకు కులం, మతం అడ్డుకాదనీ.. డబ్బుతో బంధాలను బలపర్చలేమని 'రిశ్తే' కథ ద్వారా సమాజానికి చాటారు రచయిత సయ్యద్ గఫార్. 'కథ'కు సామాజిక ప్రయోజనం ఉండాలని ఆశించే రచయిత ఈయన. ఆ ఆశయంతోనే 1973 నుంచీ కథలు రాస్తున్నారు. ఈయన స్వస్థలం నల్లగొండ జిల్లా వాడపల్లి. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఎనిమిదేళ్లపాటు 'పంచాయతీ రాజ్ లీడర్' స్థానిక సంస్థల విశ్లేషణ మాస పత్రికను నడిపించారు. స్టేజీ నాటకాల్లో నటన, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం ఇప్పటివరకూ నిర్వహించిన అన్ని కథల పోటీలలోనూ బహుమతులు గెలుచుకున్నారు. రెండుసార్లు కన్సొలేషన్ బహుమతులు, ఒకసారి విశిష్ట, మరోసారి ప్రత్యేక బహుమతి పొందగా.. ఇప్పుడు 'రిశ్తే' కథకు తృతీయ బహుమతి దక్కించుకున్నారు. 2017లో 'జనన వాంగ్మూలం' అనే కవితా సంపుటిని తెచ్చారు. ప్రస్తుతం 'ఖుర్బాని' కథల సంపుటి ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నది.